క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు జెడ్పీ చైర్మన్ పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం, రొంపికుంట, నాగారం, కమాన్‌పూర్ గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను బుధవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సర్పంచ్‌లు నీలం సరిత, కొమురమ్మ, నాయకులు ఉన్నారు.

ముత్తారం: మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన కూరాకుల వీరమ్మ, జంగపల్లి ఐలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బుధవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, ఆర్‌బీఎస్‌కే మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, నాయకులు చెలుకల అశోక్, రమేశ్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఎంపీపీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

కమాన్‌పూర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ ఉద్యమకారులు ఎంపీపీ రాసకొండ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఉద్యమ సమయంలో చిన్న చిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు వదిలిపెట్టి ఉద్యమకారులు పని చేస్తే ప్రస్తుతం వారి కుటుంబాలకు పూట గడువడం కష్టంగా మారిందన్నారు. సంక్షేమ బోర్డుతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు, బీసీ రుణాలు ఇచ్చి ఆదుకునే విధంగా చూడాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పోతు జ్యోతిరెడ్డి, మేదరి లింగస్వామి, పంతకాని రవి, గుర్రం శంకర్, మట్ట రాధ, రాజయ్య, తిరుపతి, నారాయణ పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



ఎల్‌వోసీ అందిస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: పేద కుటుంబాలకు అండగా ఉండి ఆదుకోవడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన గంగిపెల్లి కుమారస్వామి అనారోగ్యం పాలై ఆస్పత్రిలో ఉండగా వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం రఘువీర్‌సింగ్‌కు తెలియ జేయగా, ప్రభుత్వం నుంచి లక్ష రుపాయల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. బుధవారం ఆస్పత్రిలో అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లోక రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, అంకూస్ మహ్మద్, మేర శ్రీనివాస్, కోమురయ్య, వెంకటేశ్, రవి,రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన యువకులతో సునీల్‌రెడ్డి

ముత్తారం/మంథని: మండలంలోని ఖమ్మంపల్లి, సీతంపేట, ఇప్పలపల్లి, రామకృష్ణపూర్, సందరెల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధిని చూసి టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి నాంపల్లి రమేశ్, నాయకులు ఎడ్ల సదాశివ్, చిలువేరు సతీశ్, సబ్బని సంతోష్, బోయిని నారాయణ, మల్లికార్జున్, క్రాంతి కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ 'వారసంతలకు' ఆదరణ

- కూరగాయల రైతులకు మద్దతుధర
- వినియోగదారులకు అందుబాటులో వస్తువులు
- కనీస సౌకర్యాలు కల్పించాలంటున్న స్థానికులు



జూలపల్లి మండల కేంద్రంలోని వారసంత

జూలపల్లి : ఆధునిక టెక్నాలజీతో ఇంటి వద్దకే సరుకులు చేరుస్తున్న కార్పొరేట్ కంపెనీలకు ధీటుగా,సూపర్ మార్కెట్లలో దొరికే వస్తువులను గ్రామీణ పేదలకు అందుబాటు ధరల్లో దొరుతున్నాయి. గ్రామంలోనే రైతులకు,కూలీలకు అనుకూలమైన సమయంలో కావలసిన సరుకులు వారసంతల్లో అమ్ముతూ వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. గ్రామీణ యువతకు ఉపాధి దొరకడంతో పాటు తైబజారుతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. దీంతో గ్రామీణ వారసంతలకు ప్రజాదరణ లభిస్తోంది. పట్టణం, పల్లె తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో వారంలో ఏదో ఒక రోజు వారసంతలు జరుగుతున్నాయి. మండలంలోజూలపల్లి,వడ్కాపూర్, కాచాపూర్,వెంకట్రావుపల్లె,కుమ్మరికుంట,అబ్బాపూర్,పెద్దాపూర్,తేలుకుంట గ్రామాల్లోని ఏదో ఒక రోజు వార సంత నిర్వహిస్తున్నారు.. దీంతో కూలీలు,వ్యవసాయకూలీలు, వినియోగదారులు,రైతులు తమకవసరమైన వస్తువులను తమ గ్రామంలోనే తక్కువ ధరలో దొరుకుతుండడంతో వార సంతల్లో కొనుగోలుకు గ్రామస్తులు

కూరగాయల రైతులకు మద్దతు ధర, అందుబాటు ధరలో సామగ్రి లభ్యం..

గ్రామాల్లో కూరగాయలు పండించే రైతులకు ఉన్న గ్రామంలోనే వారసంతలో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. రవాణా,మధ్యవర్తులకు కమీషన్ ఖర్చులు లేకపోవడంతో లాభాలు వస్తున్నాయి. దీంతో గ్రామీణులకు తక్కువ ధరకే కూరగాయలు లభిస్తున్నాయి.

నిరుద్యోగులకు ఉపాధి..

వారసంతల్లో నిరుద్యోగులు పండ్లు, మసాలా దినుసులు, బట్టలు, చెప్పులు,స్టీలు సామాను అమ్ముతూ ఉపాధి పొందుతున్నారు. వ్యాపారుల నుంచి తైబజారు వసూలు చేస్తూ పంచాయతీలు ఆదాయం సమకూర్చుకుంటున్నాయి.

కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు

వారసంతలను చాలా గ్రామాల్లో రోడ్ల వెంబడి నిర్వహిస్తుండడంతో వ్యాపారులు,వినియోగదారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. గ్రామాల్లో వారసంతలకు స్థలం కేటాయించి వసతులు కల్పించాలని, తాగునీరు, మూత్రశాలలు అందుబాటులో ఉండే విధంగా సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి దొరుకుతోంది



వారసంతలు ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో నిర్వహించడంతో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాను. వ్యాపారులకు,వినియోగదారులకు వారసంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

– నాగుల తిరుపతి.వ్యాపారి

మద్దతు ధర వస్తోంది



మేము పండించిన కూరగాయలను గ్రామంలోని వార సంత విక్రయిస్తుండడంతో మద్దతు ధర లభిస్తోంది. రవాణా ఖర్చులు మిగులుతున్నాయి. ఎక్కడో దూరంలో ఉన్న పట్నం పోయి విక్రయించే శ్రమ, సమయం కలిసి వస్తోంది.

– కుంట రాజేశ్వర్‌రెడ్డి,కుమ్మరికుంట

'కంటి వెలుగు' ప్రారంభానికి ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్, రాగినేడు గ్రామాల్లో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమ ట్రయల్‌రన్ ను బుధవారం స్థానికసంస్థల అడిషనల్‌కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా సహకార శాఖ అధికారి మైఖేల్‌బోస్ తదితరులు పరిశీలించారు. కంటివెలుగు నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్‌కు సూచించారు.



సూచనలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా సమీపంలో ఉన్న నవోదయ హైస్కూల్‌లో గురువారం నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసే గదిలో ఏర్పాట్లు, ప్రాంగణంలో ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కృపాబాయి, డీఈ మాధవి, వైద్య సిబ్బంది ఉన్నారు.

జూలపల్లి: మండలంలో నేటి నుంచి కంటివెలుగు ప్రారంభించేందుకు మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి సర్వం సిద్ధం చేశారు. ప్రోగ్రాం వైద్యాధికారి రత్నాకర్, లహరి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంపత్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రంగారెడ్డి, ఎంపీడీవో వేణుగోపాలరావు జూలపల్లి, కుమ్మరికుంట గ్రామాల్లో బుధవారం కంటి పరీక్ష విధానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు నర్సింహ యాదవ్,సంతోశ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: కంటివెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఏవో కోరారు. బుధవారం జెడ్పీ హైస్కూల్లో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రామ్మోహానా చారి, ఎంపీవో గోవర్ధన్, కంటి వెలుగు క్యాంపు ఆఫీసర్ డాక్టర్ స్మృతి, వైద్య సిబ్బంది ఉన్నారు.

కమాన్‌పూర్: కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్ నిర్వహించారు. కంటి వెలుగుకు వచ్చే వారు ఏలాంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పాలకుర్తి: కంటివెలుగు రెండో విడత కార్యక్రమంపై బుధవారం పాలకుర్తి మండలంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. కంటి వెలుగు వైద్యశిబిరంలో వినియోగించే పరికరాలను ఎంపిక చేసిన స్థలాల్లో ఏర్పాటు చేసిన అధికారులు వాటి పనితీరును పరిశీలించారు. గురువారం బసంత్‌నగర్, పుట్నూర్ గ్రామాల్లో అధికారికంగా ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సునీత, ఎంపీడీవో లలిత, సర్పంచ్ కట్టెకోల వేణుగోపాలరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఓదెల:కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. బుధవారం మండలంలోని అన్నీ గ్రామాల్లో కంటివెలుగు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఆర్టీసీ ఇంజనీర్‌కు సన్మానం



వీరస్వామిని సన్మానిస్తున్న డిపో అధికారులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్ పనిచేసిన వీరస్వామి బదిలీపై కరీంనగర్ వెళుతున్న సందర్భంగా బుధవారం డిపో మేనేజర్ మల్లేశం, సిబ్బంది ఆయనను సన్మానించారు. అలాగే గోదావరిఖని డిపోకు బదిలీపై వచ్చిన అసిస్టెంట్ ఇంజనీర్ సంధ్యారాణికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్(పి) శంకరయ్య, అసిస్టెంట్ మేనేజర్(ఎఫ్) సదానందం, వెల్ఫేర్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థిని



వైష్ణవి

సుల్తానాబాద్: రాష్ట్ర సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించే రాష్ట్రస్థాయి సాంఘీకశాస్త్రం పోటీలకు సుల్తానాబాద్ అల్ఫోర్స్ పాఠశాలలో చదివే సావనపల్లి వైష్ణవి ఎంపికైనట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించేందుకు అల్ఫోర్స్ విద్యాసంస్థలు ముందుంటాయని అన్నారు. అనంతరం వైష్ణవిని నరేందర్‌రెడ్డి అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముత్తారం: మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు తహసీల్దార్ వరందన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో మానేరు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

బొడ్రాయి ఉత్సవాల మిగులు డబ్బులు పోస్టాఫీస్‌లో డిపాజిట్

రామగిరి: మండలంలోని రత్నాపూర్‌లో ఇటీవల నిర్వహించిన భూలక్ష్మీ–మహాలక్ష్మీ బొడ్రాయి ఉత్సవాలకు వచ్చిన డబ్బులు రూ. 76,400 లను బుధవారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సమ్మెట మల్లేశం, అల్లం రాజయ్య పేర్ల మీద పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో అల్లి రమేశ్, బత్తిని ప్రశాంత్, ఒల్లె సురేశ్, ఉడత రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం

ఓదెల: మండల కేంద్రంలో సుమారు రూ.4 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీరోడ్ల పనులను బుధవారం సర్పంచ్ ఆకుల ఉదయదేవి ప్రారంభించారు. వార్డుల్లో సరైన రోడ్లు లేక కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పడుతున్నారని, దీంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచు తీర్థాల కుమార్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదాంకు బుధవారం యూరియా వచ్చింది. యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు కావలసిన రైతులు సంఘం విక్రయ కేంద్రంలో తీసుకోవాలని సీఈవో సురేశ్ తెలిపారు.

యువకులకు క్రికెట్ కిట్లు అందజేత



క్రికెట్ బ్యాట్లు అందిస్తున్న సేవాదళం సభ్యులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో యూత్ క్లబ్ సభ్యులకు జూలపల్లి జెడ్పీటీసీ, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ పంపించిన క్రికెట్ కిట్‌ను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, కాంతయ్య బుధవారం అందించారు. కాట్నపల్లి గ్రామానికి చెందిన ఆరేపల్లి కల్యాణి కూతురు అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం రూ.3వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమాల్లో సాయినాథ్, రాజ్‌కుమార్, భాస్కర్, సంపత్, పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా'

గోదావరిఖని: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ లేబర్‌పార్టీ తరపున రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో గెలిపించి సేవచేసే భాగ్యం కల్పించాలన్నారు. ఈప్రాంత నిరుద్యోగులకు సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. సీఎస్ఆర్ నిధులతో ఈప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విజ్ఞాపన పత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో నాయకులు జీఎంరావు, మేకల జాషువా, హనుమంతు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు..



కోల్‌సిటీ: గోదావరిఖని శారదానగర్‌లోని రామగుండం నగరపాలక వాటర్ ట్యాంక్ వద్ద ప్రజల సౌకర్యార్థం కుళాయి ఏర్పాటు చేశారు. సమీపంలోని ప్రజలు, చిరువ్యాపారులు ప్రతీరోజూ తాగునీరు తీసుకెళ్తారు. దీనికి వాటర్ ట్యాప్ ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరంతా వృథాగా పోతోంది. గతంలో అనేకసార్లు కుళాయికి మూత ఏర్పాటు చేసినప్పటికీ, గుర్తుతెలియని వ్యక్తులు విరగొడుతున్నారని సిబ్బంది చెబుతున్నారు. 24 గంటలు తాగునీరు వృథాగా పారుతూ ఓపెన్ డ్రెయినేజీల్లోకి వెళ్తోంది. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీమల్లికార్జునస్వామి కేతమ్మ నాగవెల్లి పట్నం



నాగవెల్లిపట్నం వద్ద భక్తుల పూజలు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో ఒగ్గు పూజారులు మల్లికార్జునస్వామి కేతమ్మ నాగవెల్లి పట్నం అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి శ్రీమల్లికార్జునస్వామి కేతమ్మలకు మొక్కుబడులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఐకార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండలాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన పనులు, అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులు చదివి వినిపించారు. సమావేశంలో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీయగా అందులో సాంబయ్యపల్లి శివారులో ఎస్సారెస్పీ కెనాల్ వాటర్ రావడం లేదని సర్పంచ్ బాపు, కొదురుపాక, చిన్నకల్వల మీదుగా మియ్యాపూర్‌కు నీరు అందడం లేదని ఎంపీటీసీ ఫకీర్‌యాదవ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. భూపతిపూర్‌లో ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు తరుచూ చెడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ జమున, ఎంపీటీసీ విజయ అన్నారు. కందునూరిపల్లెలో రేషన్ బియ్యం తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని మరో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని సర్పంచ్ స్వరూప కోరారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, పైపులైన్‌ను ఇప్పటికీ పూర్తి చేయకపోవడంతో ఎంపీటీసీ లక్ష్మి అధికారులపై మండిపడ్డారు. అంగన్‌వాడీల్లో సరుకులు సరిగ్గా పంపిణీ చేయడం లేదని పలువురు సర్పంచ్‌లు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేయాలన్నారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు వైద్యసేవలను అందించేందుకు అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. దీనిపై సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శశికళ, నాయబ్ తహసీల్దార్ సదానందం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు వీరగోని సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



పెద్దపల్లి నుంచి బయలుదేరుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, నాయకులు

పెద్దపల్లిరూరల్: ఖమ్మం సభకు నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాలనుంచి ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సారథ్యంలో ఖమ్మం సభకు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పురాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, నాయకులు ఉన్నారు.

రామగుండం: ఖమ్మం జిల్లా కేంద్రంలో తొలిసారిగా జరుగుతున్న బీఆర్ఎస్ బహిరంగసభకు బుధవారం అంతర్గాం మండల ప్రజాప్రతినిధులు తరలివెళ్ళారు. ఇందులో జెడ్పీటీసీ ఆముల నారాయణ, సర్పంచులు బాదరవేణి స్వామి, ధర్ని రాజేశ్, సతీశ్, ధర్మాజి కృష్ణ తదితరులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ సభకు బుధవారం కాల్వశ్రీరాంపూర్ నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి దేశవ్యాప్తంగా సీఎంలు మద్దతు ప్రకటిస్తున్నారని ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. సభకు వెళ్లిన వారిలో వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొడ్డు రాజకొమురయ్య, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, నాయకులు తరలివెళ్లారు.

పెద్దపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం



నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్ చౌరస్తా వద్ద బుధవారం ఎన్టీఆర్ 27వ వర్ధంతిని ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, ఉప్పురాజు, మండల సత్యనారాయణరెడ్డి, గోపగాని సారయ్య, తిరుపతి, మస్రత్, బొడ్డుపల్లి శ్రీను, సంపత్, తూముల శ్రీనివాస్, సిరవేని స్వప్న తదితరులు పెద్దపల్లి ప్రగతినగర్ కూడలి వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కూడలివద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

గోదావరిఖని: గాంధీనగర్‌లోని కార్యాయలంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు కోటగిరి పాపయ్య, ఏడుకొండలు, పెద్దపల్లి సత్యనారాయణ, కంది చంద్రయ్య, చంద్రమౌళి, ఓదెలు, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో బాలింతలకు, ఇన్‌పేషెంట్లకు బుధవారం టీడీపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎన్టీయూసీ కమిటీ సభ్యుడు పెద్దపెల్లి సత్యనారాయణ, నాయకులు కోటగిరి పాపయ్య, నిమ్మకాయల ఏడుకొండలు,తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటీలో 'ఫ్రెషర్స్' డే



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం ఎంబీఏ విద్యార్థులు 'ఫ్రెషర్స్' డే వేడుకలు జరుపుకున్నారు. విధ్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. కార్యక్రమంలో డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, ఆరీఫ్, కౌసల్య, రామ్మోహన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

22న ఎన్టీపీసీలో ఆనంద్ మేళా

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో ఈనెల 22న ఆనంద్ మేళాను నిర్వహిస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. టౌన్‌షిప్‌లోని మహాత్మగాంధీ క్రీడా మైదానం ఆవరణలో నిర్వహించనున్న ఆనంద్ మేళాలో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

నూతన నియామకం

సుల్తానాబాద్‌రూరల్:తెలంగాణ యువ చైతన్య ఫౌండేషన్ పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన తిప్పరవేని రాజును నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్ తెలిపారు. తనపై నమ్మకంతో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు



మల్కాపూర్‌లో ఎత్తుగా ఉన్న రోడ్డు

జ్యోతినగర్: రోడ్డు ఎత్తుగా నిర్మించడంతో పక్కన ఉన్న స్థలం లోతుగా మారి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లో వరద నీరు రోడ్డుపైకి వస్తున్న క్రమంలో ఉన్న రోడ్డుపై ఎత్తుగా కొత్త రోడ్డును నిర్మించారు. రోడ్డు నిర్మించినప్పటికీ పక్కన ఉన్న ప్రాంతం లోతుగా ఉండటంతో రాత్రి సమయంలో వాహనదారులు రోడ్డు పక్కకు వస్తే కిందపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు పక్కన లోతుగా ఉన్న ప్రాంతాన్ని మట్టితో నింపి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.